క్లుప్తంగా

పంట కాలువను పరిశీలించిన గరటయ్య



అధికారులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గరటయ్య

మేదరమెట్ల: మండలంలోని రాచపూడి గ్రామంలో గుండ్లకమ్మ నీటి పంట కాలువలను మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు డాక్టర్ బాచిన చెంచుగరటయ్య సోమవారం పరిశీలించారు. కాలువల పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. నీటి పారుదల కావడం కోసం చేయాల్సిన పనుల గురించి అడిగారు. కాలువల్లో నీరు పారించి రైతులకు నీరు అందించేలా చూడాలని చెప్పారు. అందుకోసం ఉన్నతాధికారులతో మాట్లాడతానని చెప్పారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

అద్దంకి: వివిధ గ్రామాల్లోని ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు ఆయా గ్రామాలకు చెందిన అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీవో ప్రద్యుమ్నకుమార్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. వచ్చే నెల 11వ తేదీ లోపుగా అర్హులు దరఖాస్తు చేసుకుంటే, 17వ తేదీన పరిశీలించి అర్హులను ప్రకటిస్తామని తెలిపారు. 25వ తేదీన ఇంటర్వ్యూ ఉంటుందని తెలిపారు. సంతమాగులూరు మండలంలోని వివిధ గ్రామాల్లో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీవో సాంబశివరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని కొమ్మాలపాడు, కుందుర్రు, చవిటిపాలెం, ఫత్తేపురం గ్రామాల్లో ఒక్కొక్కటి చొప్పున ఖాళీలు ఉన్నట్లు తెలిపారు

చీరాల టౌన్: మండలంలోని గ్రామ పంచాయతీల్లో ఖాళీగా ఉన్న 15 గ్రామ వలంటీర్ పోస్టులకు అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తులు ఆన్‌లైన్‌లో చేసుకోవాలని ఎంపీడీవో నేతాజీ ప్రకటనలో సూచించారు. మండలంలోని కావూరివారిపాలెంలో 2, తోటవారిపాలెంలో 1, చీరాలనగర్ గ్రామ పంచాయతీల్లో దేవాంగపురిలో-6, గవినివారిపాలెం-3, తోటవారిపాలెం-1, ఈపురుపాలెంలో-5 పోస్టులు ఖాళీగా ఉన్నాయని 18 నుంచి 35 ఏళ్లలోపు వారు ఆన్‌లైన్‌లో తమ దరఖాస్తులను ఏప్రిల్ 10 తేదీ లోపు పూర్తి చేయాలని ఎంపీడీవో నేతాజీ ప్రకటనలో సూచించారు.

పొదుపు సంఘం లీడర్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు



ఫిర్యాదు చేసిన పొదుపు గ్రూపు మహిళలు

మార్టూరు: బ్యాంకులో జమ చేయమని గ్రూపు సభ్యులు ఇచ్చిన నగదును సొంతానికి వాడుకొన్నదంటూ గ్రూపు లీడర్‌పై వలపర్ల గ్రూపు సభ్యులు సోమవారం బాపట్ల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. బాధితులు, ఏపీఎం రాజారత్నం వివరాల మేరకు.. వలపర్లకు చెందిన మేరీమాత గ్రామైఖ్య పొదుపు సంఘం సభ్యులు తాము ప్రతినెల బ్యాంకులో జమ చేయాల్సిన నగదును గ్రూపు మొదటి లీడర్ ముకిరి మరియమ్మకు అందజేసేవారు. అలా ఇచ్చిన రూ.2.25 లక్షలు నగదును మరియమ్మ సొంతానికి వాడుకొని బ్యాంకులో జమ చేయలేదు. ఈ నేపథ్యంలో గ్రూపు సభ్యులు గ్రీవెన్స్‌లో కలెక్టర్ విజయకృష్ణన్‌కు, ఎస్పీ వకుల్ జిందాల్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన జిల్లా కలెక్టర్ తక్షణం మరియమ్మ బ్యాంకులో నగదు జమ చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారి లక్ష్మిని ఆదేశించారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

అద్దంకి రూరల్: అద్దంకి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు 17 మంది క్యాంపస్ సెలక్షన్‌లో ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ ఏవీ ప్రసాద్ సోమవారం తెలిపారు. చిత్తూరు జిల్లాకు చెందిన స్మార్ట్ డీవీ టెక్నాలజీ కంపెనీకి పాలిటెక్నిక్ మూడో సంవత్సరం చదువున్న విద్యార్థి కె శ్రీనివాస్, వీల్ ఇండియా కంపెనీకి 16 మంది విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు. కంప్యూటర్, ఎలక్ట్రానిక్స్ చదివిన విద్యార్థులకు కోర్సు మూడేళ్లు పూర్తయిన వెంటనే ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. విద్యార్థులను ప్రిన్సిపల్, అధ్యాపకులు అభినందించారు.

పంట నష్టంపై అంచనాలు

బల్లికురవ: అకాల వర్షంతో ఐదు రోజుల క్రితం మండలంలో కురిసిన భారీ వర్షం, ఈదురు గాలులకు 500 హెక్టార్లలో మొక్కజొన్నకు నష్టం వాటిల్లగా ప్రాథమిక అంచనాలు తయారు చేసినట్లు వ్యవసాయాధికారిణి ఎస్‌వీపీ కుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల వారీగా ఈ-క్రాప్‌లో నమోదు చేసుకున్న రైతులకు సంబంధించి పరిగణన టీమ్‌లు పొలాలను పరిశీలిస్తారని కుమారి వివరించారు.

సీఎం జగన్‌ను కలిసిన నాయకులు









టంగుటూరు: వైఎస్సార్ సీపీ కొండపి ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వరికూటి అమృతపాణి తల్లి కోటమ్మ అనారోగ్యంతో మృతి చెందడంతో కారుంచిలో సోమవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కార్యక్రమంలో చీరాల, అద్దంకి నాయకులు సీఎం జగన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. వారిలో ఎమ్మెల్సీ పోతుల సునీత దంపతులు, ఎమ్మెల్యే కరణం బలరాం, శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య, చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ ఉన్నారు.

నేడు గృహసారథులకు శిక్షణ

పర్చూరు: మండల కేంద్రంలోని పర్చూరు వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో నేడు ఉదయం 9 గంటలకు నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ ఆధ్వర్యంలో గృహసారథులు,గ్రామ వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, మండల కన్వీనర్లకు శిక్షణ సమావేశం నిర్వహించనున్నట్లు సోమవారం ఆపార్టీ కార్యాలయ వర్గం సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. అనంతరం 10 గంటలకు వైఎస్సార్ ఆసరా పథకానికి సంబంధించి పొదుపు సంఘాల మహిళలకు ఆమంచి కృష్ణమోహన్ ముఖ్య అతిథిగా పాల్గొని చెక్కుల పంపిణీ చేస్తారని తెలిపారు.

వైఎస్సార్ ఆసరాతో పేదలకు అండ



డ్వాక్రా మహిళలకు చెక్కు పంపిణీ చేస్తున్న కృష్ణచైతన్య, గరటయ్య



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కృష్ణచైతన్య, మహిళలు

● శాప్‌నెట్ చైర్మన్ బాచిన కృష్ణచైతన్య

జే.పంగులూరు: వైఎస్సార్ ఆసరాతో పేద మహిళలకు అండగా నిలుస్తూ, వారి జీవితాల్లో వెలుగులు నింపుతుందని ఏపీ శాప్ నెట్ చైర్మన్, అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ బాచిన కృష్ణ చైతన్య, మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు బాచిన చెంచు గరటయ్య పేర్కొన్నారు. మండల పరిధిలోని పంగులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం వైఎస్సార్ ఆసరా మూడో విడత కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న కృష్ణచైతన్య, గరటయ్యలు మట్లాడుతూ వైఎస్సార్ ఆసరాలో భాగంగా మండలంలోని 21 గ్రామాలకు గాను 982 గ్రూపులకు 9825 మంది డ్వాక్రా మహిళలకు రూ. 7.71 కోట్లు మహిళల పొదుపు ఖాతాలో జమ అయిందన్నారు. రాజకీయ పార్టీలు హమీలు ఇవ్వడం అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన హమీలు మర్చిపోయే పార్టీలు చాలా ఉన్నాయన్నారు. కాని మన జగనన్న ఇచ్చిన ప్రతి హమీలు అధికారం వచ్చిన అనంతరం పూర్తి నేరవేర్చి రాజకీయానికి కొత్త అర్థం చెప్పాడన్నారు. రాబోవు 2,3 నెలలో మన నియోజకవర్గంలో జగనన్న కార్యక్రమం ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఒక సీటు వచ్చినందుకే ప్రభుత్వం పని అయిపోయిందని టీడీపీ తప్పుడు ప్రచారం సాగిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పొరపాట్లు ఏవైనా ఉంటే సరిచేసుకొని రాబోవు ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలుస్తామన్నారు. అనంతరం డ్వాక్రా మహిళలకు చెక్కులు పంపిణీ చేసి సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఏపీఎం జ్యోతి ప్రసాద్‌బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ తేళ్ల నాగమ్మ, జెడ్పీటీసీ రాయిణి ప్రమీళ, మండల ఉపాధ్యక్షుడు యర్రం శ్రీనివాసరెడ్డి, మండల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రాయిణి వెంకటసుబ్బారావు, ఏసీ రవికుమార్, మండల సమైఖ్య అధ్యక్షురాలు పూసల గాయత్రి, ఏపీఎంలు అనురాధ, కోటేశ్వరావు, బీ సురేంద్ర ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, డ్వాక్రా మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మాట తప్పని, మడిమ తిప్పని నైజం జగనన్నది



స్వర్ణలో వైఎస్సార్ ఆసరా చెక్కు పంపిణీ చేస్తున్న ఆమంచి

● వైఎస్సార్ ఆసరా చెక్కు పంపిణీ
● పాల్గొన్న నియోజకవర్గ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే ఆమంచి

స్వర్ణ (కారంచేడు): రాష్ట్రంలోని అక్కాచెల్లెమ్మలకు ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన మాట నిలబెట్టుకొవడానికి జగనన్న ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని చీరాల మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త ఆమంచి కృష్ణమోహన్ అన్నారు. సోమవారం ఆయన మండలంలోని స్వర్ణ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన డ్వాక్రా మహిళలకు డాక్టర్ వైఎస్సార్ ఆసరా పథకం చెక్కు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమంచి మాట్లాడుతూ కారంచేడు మండలంలో సుమారు 865 గ్రూపులకు చెందిన 8250 మంది మహిళలకు నేడు జగనన్న మూడో విడత వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా రూ 7.65 లక్షలను ఖాతాలకు జమ చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వ నిర్వాకంతో పెండింగ్‌లో ఉన్న సునా వడ్డీ నిధులను అక్క, చెల్లెమ్మల ఖాతాలకు నేడు జగనన్న ప్రభుత్వం వేస్తుందన్నారు. వైఎస్సార్ ఆసరాతో పేద మహిళలకు ఎంతో అండగా ఉంటుందన్నారు. జగనన్న ఇచ్చిన హామీలను నెరవేర్చుకుంటూ ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు యార్లగడ్డ రజనీశ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ ఐనంపూడి వనజ, పర్చూరు ఏఎంసీ మాజీ చైర్మన్ జువ్వా శివరాం ప్రసాద్, రాష్ట్ర హిస్టరీ అకాడెమీ డైరెక్టర్ జక్కిరెడ్డి సుబ్బాయమ్మ, దగ్గుబాటి రామకృష్ణ, కోఆప్షన్ మెంబర్ ముల్లా నూర్‌అహ్మద్, దండా చౌదరిబాబు, పఠాన్ కాలేషావలీ, బండారు ప్రభాకర్, వక్ఫ్‌బోర్డు కార్యదర్శి గద్దం మస్తాన్‌వలీ, ఎంపీటీసీ సభ్యురాలు పాలేరు వీరమ్మ, ఎంపీడీవో రమేష్‌బాబు, ఐకేపీ ఏపీఎం మధుసూదనరావు, యార్లగడ్డ పాపారావు, కారుమూడి సుబ్బారెడ్డి, మన్నెం చిరంజీవి, యార్లగడ్డ శ్రీకాంత్, గోగినేని సతీష్, సర్పంచ్ మోటాని మధుసూదనరావు, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం తాగి విధులు నిర్వహిస్తున్నాడని ఫిర్యాదు



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న జెడ్పీటీసీ తిరుమలాదేవి

వేటపాలెం: స్థానిక ప్రాథమిక వైద్యశాలలో వైద్యాధికారి ప్రభాకర్‌రావు తరచూ తాగి విధులు నిర్వహిస్తున్నాడని జెడ్పీటీసీ సభ్యురాలు బండ్ల తిరుమలాదేవి జిల్లా కలెక్టర్ కే విజయకృష్ణన్‌కు స్పందనలో సోమవారం ఫిర్యాదు చేశారు. ఈనెల 25వ తేదీన వైద్యశాలలో డాక్టర్ ప్రభాకర్‌రావు, యూడీసీ శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్ పిచ్చియ్య ముగ్గురు కలసి మద్యం తాగి నానా హంగామ చేశారని తెలిపారు. ఆ సమయంలో స్థానికులు పోలీసులకు సమాచారం అందిచండంతో చర్యలు తీసుకోవడానికి ప్రయత్నించగా వారితో సర్ది చెప్పి పంపిచారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వైద్యం కోసం వచ్చే వారిపై అమర్యాదగా ప్రవర్తించిన ఘటనలపై జిల్లా పరిషత్ చైర్మన్‌కి ఫిర్యాదు చేశామని తెలిపారు. అయిననప్పటికీ డీఎంహెచ్‌ఓ ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. వీరి వెంట బూలసల రామలక్ష్మి, బండ్ల బాబు, పర్వతరెడ్డి రేణుక ఉన్నారు.

పోలీస్ స్టేషన్‌కు చేరిన పది ప్రశ్నపత్రాలు



పోలీస్ స్టేషన్‌లో పదో తరగతి పరీక్ష పేపర్లను అప్పగిస్తున్న రూట్ ఆఫీసర్లు

చినగంజాం: మండలంలోని చినగంజాం, కడవకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఏప్రిల్ మొదటి వారంలో ప్రారంభం కాబోయే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి ప్రశ్నపత్రాలు సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌కు చేరాయి. చినగంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 260 మంది, కడవకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 169 మంది విద్యార్థులు, సబ్జెక్టులు తప్పిన మరో ఆరుగుగురు విద్యార్థులు కలిపి మొత్తం 435 మంది పరీక్షలు రాస్తున్నారు. రూట్ ఆఫీసర్ పీ సుబ్రమణ్యేశ్వరరావు స్టేషన్‌లో అప్పగించారు. కార్యక్రమంలో పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరిటెండెంట్‌లు డీ రత్నకుమారి, బీ ప్రసన్న కుమారిలు పాల్గొన్నారు.

పోషకాహారంతో గర్భిణులకు మేలు



మాట్లాడుతున్న సీడీపీవో సుభద్ర

పర్చూరు: పోషకాహారంతో గర్భిణులకు మేలు చేకూరుతుందని సీడీపీవో జి. సుభద్ర అన్నారు. సోమవారం మండల కేంద్రమైన పర్చూరులోని ఇందిరాకాలనీలో 8వ అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార పక్షోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ సుభద్ర చిరుధాన్యాలు, పోషక విలువలు గురించి వివరించారు. పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం వల్ల రక్తహీనతను నివారించవచ్చని గర్భిణులు, బాలింతలకు తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పి.దీపదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎస్. దేవి, జయశ్రీ పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష మెటీరియల్ పంపిణీ



విద్యార్థులతో క్లబ్ సభ్యులు

పర్చూరు: రోటరీ క్లబ్ ఆఫ్ పర్చూరు సెంట్రల్ ఆధ్వర్యంలో ఉప్పుటూరు, చెరుకూరు, వీరన్నపాలెం హైస్కూళ్లు, పర్చూరు బాలికోన్నత పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు రోటరీ క్లబ్ అధ్యక్షులు నాగభైరు శ్రీనివాసరావు సోమవారం పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, ఇతర మెటీరియల్ పంపిణీ చేశారు. వీటికి దాతలు నర్రా వెంకట్, లక్ష్మీసుధ దంపతులు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి పంబి సదానందరెడ్డి, కోమటి ఆంజనేయులు, కొల్లా సుబ్బారావు, ప్రధానోపాధ్యాయులు టి.శ్రీనివాసరావు, సుబ్బారావు, ఆవని, పాల్గొన్నారు.

ప్రతి హామీని నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌దే



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న సురేష్, తదితరులు

చీరాల: ప్రజాసంకల్ప పాదయాత్రలో ఇచ్చిన ప్రతీ హామీని విధిగా అమలుచేసి పేదల కష్టాలను నెరవేరుస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కిందని వైఎస్సార్ సీపీ నాయకులు పోతుల సురేష్ అన్నారు. సోమవారం పట్టణంలోని గడియార స్తంభం సెంటర్లో చీరాల ఇవాంజలిస్ట్ పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దళిత క్రైస్తవులను ఎస్సీ హోదా కల్పిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసినందుకు సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈసందర్భంగా పోతుల సురేష్ మాట్లాడుతూ ఏళ్లతరబడి పెండింగ్‌లో ఉన్న దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పిస్తూ తీర్మానం చేసి దళిత క్రైస్తవులకు ఎనలేని మేలు చేశారని కొనియాడారు. కార్యక్రమంలో రెవరెండ్ లూథర్‌శాస్త్రి, పీటర్ రమేష్, పాల్ రమేష్, దేవ సహాయం, ఇస్రాయేల్, ప్రభుదాసు, అనీల్‌కుమార్ తదితరులు ఉన్నారు.

మున్నంవారిపాలెంలో నిలిచిన రేషన్

చినగంజాం: మండలంలోని మున్నంవారిపాలెం గ్రామంలో పౌరసరఫరాల శాఖ ద్వారా పంపిణీ అయ్యే రేషన్ బియ్యం పంపిణీ నెల రోజులుగా పూర్తిగా నిలిచిపోయింది. గ్రామంలో మొత్తం 610 మంది వినియోగదారులుండగా గత నెల రోజులుగా రేషన్ బియ్యం దుకాణం ద్వారా కాని, సంచార రేషన్ పంపిణీ వాహనం ద్వారా కాని బియ్యం అందడం లేదు. గతంలో గ్రామంలోని షాపు నెం 21 రేషన్ దుకాణంలోని దుకాణదారుడిపై 6-ఏ కేసు నమోదు కాగా అతనిని తొలగించి స్థానికంగా మరో రేషన్ దుకాణ దారుడికి ఇన్‌చార్జ్ అప్పగించారు. అయితే గత నెల రోజులుగా సంచార వాహనానికి అధికారులు రేషన్ కేటాయించకపోవడంతో గ్రామంలో రేషన్ పంపిణీ పూర్తిగా నిలిచిపోయింది. దీంతో గ్రామంలోని ప్రజలు రేషన్ అందక ఇబ్బందులు పడుతున్నారు. తహసీల్దార్ రేషన్ సమస్యపై స్పందించి గ్రామ ప్రజల సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. గ్రామానికి చెందిన బేతాళ మునిరత్నం, నల్లమోపు జయసింహారెడ్డి, ఆసోది నారపరెడ్డి, నల్లమోపు భాస్కరరెడ్డి తదితరులు సోమవారం సర్పంచ్ నల్లమోపు పద్మావతికి తెలిపారు.

వేర్వేరుగా తడి, పొడిచెత్త సేకరించాలి



కార్మికులతో మాట్లాడుతున్న ఎంపీడీవో

మేదరమెట్ల: ఇక నుంచి ఇంటివద్దనే తడిచెత్త, పొడి చెత్తను వేర్వేరుగా క్లాప్ మిత్రల ద్వారా సేకరించాలని ఎంపీడీవో సరేశ్ అన్నారు. సోమవారం స్థానిక లోకల్ ట్రెనింగ్ సెంటర్‌లో చీరాల డివిజన్‌కు చెందిన అద్దంకి, బల్లికురవ, చినగంజాం మండలాల్లోని రెండేసి గ్రామ పంచాయతీల కార్మికులకు ట్రెనింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సెక్రటరీ లక్ష్మీ కాంత్, తిమ్మాయపాలెం పంచాయతీ సెక్రటరీ, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

భవిత కేంద్రంతో విద్యార్థులకు భవిష్యత్

అద్దంకి: భవిత కేంద్ర అభివృద్ధికి మూల స్తంభం రామకృష్ణ అని ఐఈఆర్‌టీ ఉపాధ్యాయుడు కొంగల శ్రీనివాస్ అన్నారు. స్థానిక భవిత కేంద్రంలో సోమవారం ఎల్ఐసీ రిటైర్డ్ డెవలప్‌మెంట్ అధికారి రామకృష్ణ కుటుంబ సమేతంగా వచ్చి ప్రత్యేక అవసరాల పిల్లలకు పుస్తకాలు, స్వీట్లు పండ్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఐఈఆర్‌టీ ఉపాధ్యాయుడు మాట్లాడుతూ రామకృష్ణ రూ.5 లక్షల విలువ చేసే ఉపకరణాలను భవిత కేంద్రానికి అందజేసిన విషయాన్ని గుర్తు చేశారు.

రేపు అద్దంకి పురపాలక సంఘం సమావేశం

అద్దంకి రూరల్: ఈనెల 29 తేదీ బుధవారం ఉదయం 11 గంటలకు స్థానిక కౌన్సిల్ హాల్‌లో పురపాలక సంఘం ప్రత్యేక సమావేశం, అలాగే 11.30 గంటలకు సాధారణ సమావేశం నిర్వహించనున్నట్లు చైర్మన్ ఎల్ ఎస్తేరమ్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సమస్యల పరిష్కారంలో అశ్రద్ధ వద్దు

చీరాల టౌన్: ప్రజలకు ఉన్న రెవెన్యూ సమస్యల పరిష్కారంలో రెవెన్యూ ఉద్యోగులు, సిబ్బంది అలసత్వం వహించకుండా నిబద్ధతతో పనిచేయాలని తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు సూచించారు. సోమవారం రెవెన్యూ కార్యాలయంలోని సమావేశ హాలులో రెవెన్యూ ఉద్యోగులతో తహసీల్దార్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని రెవెన్యూ గ్రామాల వారీగా పెండింగ్‌లో ఉన్న అర్జీలను త్వరగా విచారణలు చేసి ప్రజల సమస్యలను పరిష్కరించాలన్నారు. రెవెన్యూ ఉద్యోగులు ప్రజలతో సత్సంబంధాలు కలిగి జవాబుదారీగా పనిచేయాలన్నారు. వీఆర్వోలు వారికి కేటాయించిన గ్రామాల్లోని ప్రజలకు అందుబాటులో ఉండి రెవెన్యూ సేవలను అందించాలని సూచించారు. సమావేశంలో డీటీ సురేష్, ఆర్ఐ శేఖర్, లోకేష్, వీఆర్వోలు ఉన్నారు.

శింగరకొండ దర్శిని



అద్దంకి: శోభకృత్ నామ సంవత్సరం. ఉత్తరాయణం పాల్గుణ మాసం మృగశిర నక్షత్రం సప్తమి తిథి సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర సోమవారం తెలిపారు. క్షేత్రప్రాధాన్యం ఉన్న మంగళవారం ఆంజనేయస్వామికి ఇష్టమైన ఆకు పూజ చేస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని చెప్పారు. ఉదయం 5గంటలకు సుప్రభాత సేవ, 5.30 గంటలకు బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు సువర్చలా సహిత దక్షిణాభిముఖ ప్రసన్నాంజనేయ స్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

దాతల సహకారంతో వసతి గదుల ప్రారంభం

చినగంజాం: మండలంలోని పావులూరు పొలిమేర వీర ఆంజనేయస్వామి ప్రాంగణంలో ప్రతాప ఆంజనేయస్వామి అన్న సత్రంపై దాతల సహకారంతో నిర్మాణం చేసిన వసతి గదులను సోమవారం పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రారంభోత్సవం చేశారు. భవన నిర్మాణాలకు గంగవరానికి చెందిన తంగా రోశయ్య, లక్ష్మీ నరసమ్మ జ్ఞాపకార్థం కుమారులు, వారి కుటుంబ సభ్యులు రూ. 1 లక్ష, నాగండ్ల గ్రామానికి చెందిన యర్రమాసు రాఘవయ్య, చెంచమ్మ కుటుంబ సభ్యులు రూ.1.25 లక్షలు, పావులూరుకు చెందిన చిడిపూడి పెదశేషిరెడ్డి, సౌభాగ్యమ్మ, కుమారుడు, కుమార్తె వారి కుటుంబ సభ్యులు రూ.1.25 లక్షలు అందజేశారు. కార్యక్రమంలో బద్రిరెడ్డి, బ్రహ్మరెడ్డి, వెంకటరెడ్డి, సుబ్బారెడ్డి, శివమ్మ పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణ పనులు పూర్తిచేయాలి

బల్లికురవ: ప్రభుత్వం సొంతింటి కలను నిజం చేసేందుకు గ్రామాల వారీగా జగనన్న కాలనీలు, సొంత స్థలాలకు మంజూరు చేసిన పక్కా గృహాలను సత్వరమే పూర్తి చేయించాలని గృహనిర్మాణ శాఖ డీఈ దాశరథి శర్మ కోరారు. సోమవారం స్థానిక పరిషత్ కార్యాలయంలో 20 సచివాలయాల సెక్రటరీలు ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, గృహనిర్మాణ శాఖ సిబ్బందితో ఇంటి నిర్మాణాలపై గ్రామాల వారీగా సమీక్షించారు. ఏప్రిల్ 12 నాటికి అందరూ గృహ ప్రవేశాలు చేసేలా లబ్ధిదారులందరికీ అవగాహన కల్పించాలని డీఈ కోరారు. సమీక్షలో హౌసింగ్ ఏఈ దుర్గా రమేష్ పాల్గొన్నారు.